సాక్షి
పశ్చిమగోదావరి
సోమవారం । 26 । మే । 2025



ఇండోర్ స్టేడియం.. నిండా నిర్లక్ష్యం

ఏలూరు ఇండోర్ స్టేడియం గత వైభవాన్ని కోల్పోతోంది. ప్రభుత్వ ఉదాసీనత, నిధుల కొరతతో పాటు అధికారుల నిర్లక్ష్యానికి నిలువటద్దంగా మారుతోంది. 8లో ▸



చిరుద్యోగులే బలి!

ఇళ్ల నిర్మాణ సామగ్రి మాయం కేసులో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులపై వేటు వేస్తున్నారు. అధికారులను వదిలేసి.. వర్క్ ఇన్‌స్పెక్టర్లపై చర్యలు తీసుకుంటున్నారు. 8లో ▸



ఖరీఫ్‌కు ఆదిలోనే ఆటంకం

గత 10 నుంచి 15 రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలు ఖరీఫ్ నారుమడి పనులకు ఆటంకంగా మారాయి. విత్తనాలు కొట్టుకుపోతున్నాయని రైతులు వాపోతున్నారు. 8లో ▸

న్యూస్‌రీల్

ప్రభుత్వ ఉద్యోగుల సంఘ కార్యవర్గం ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న ఉద్యోగుల సంఘ జిల్లా కార్యవర్గం

భీమవరం (ప్రకాశంచౌక్): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా యూనిట్ సమావేశం ఆదివారం నిర్వహించారు. జిల్లా యూనిట్ కార్యవర్గ కమిటీకి ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా వై.మోహనరావు, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎస్‌కె ఉమర్ అలీ షా, ఉపాధ్యక్షులుగా జీవీ రామనాగు, ఎస్.మానస, ఎంవీ లక్ష్మీనారాయణ, ఎం.సదాశివ ప్రసాద్, కే.కనకరాజు, ఎం.వెంకటేష్, ఎం.సాయిబాబా, వి.రాజేష్ కుమార్ ఎన్నికయ్యారు. కార్యదర్శిగా జి.జక్కరయ్య ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎస్‌వీఎస్ వాసు పులగండం, సహాయ కార్యదర్శులుగా ఎండీ అస్గర్ అలీ, కే మాణిక్యాలరావు, సీహెచ్ రాజేష్, జి.నారాయణ, జి.ప్రసాద్, ఎం.పద్మిని, కోశాధికారిగా పి.నాగభూషణం ఎన్నికయ్యారు.

మహిళల క్రికెట్ జట్ల ఎంపికకు సన్నాహాలు

ఏలూరు రూరల్: మే 31, జూన్ 1న భీమవరం డీఎన్నార్ కళాశాల గ్రౌండ్‌లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా బాలికల క్రికెట్ జట్ల ఎంపిక చేపట్టనున్నామని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ అడహక్ కమిటీ సభ్యులు ఆర్ఎస్ఆర్ మూర్తి, ఈ.అశోక్‌కుమార్, ఎస్‌కె సాబీర్ హుస్సేన్ ఓ ప్రకటనలో తెలిపారు. అండర్-15 విభాగంలో బాలికలు సెప్టెంబర్ 1, 2010 తర్వాత పుట్టి ఉండాలన్నారు. అండర్-19 విభాగంలో మహిళలు సెప్టెంబర్ 1, 2006 తర్వాత, అండర్-23 విభాగంలో సెప్టెంబర్ 1 2002 తర్వాత పుట్టిన వారై ఉండాలన్నారు. ఆసక్తి గల క్రీడాకారిణులు తమ వయసు ధ్రువీకరణ పత్రం, స్టడీ సర్టిఫికెట్, ఆధార్‌తో పాటు సొంత క్రికెట్ కిట్‌తో ఉదయం 9 గంటలకు హాజరుకావాలని సూచించారు. జట్లకు ఎంపికైన వారు ఏసీఏ పర్యవేక్షణ జరిగే అంతర జిల్లా క్రికెట్ పోటీల్లో పాల్గొంటారని వివరించారు. మరింత సమాచారం కోసం 70136-33143 నెంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు.

కిటకిటలాడిన రాట్నాలమ్మ దేవస్థానం



రాట్నాలమ్మ

పెదవేగి: రాట్నాలమ్మ అమ్మవారి దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి, విశేష రీతిలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మొక్కుబడులు తీర్చుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ వారం అమ్మవారికి మొత్తం రూ.1,01,960 ఆదాయం లభించిందని దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎన్.సతీష్‌కుమార్ తెలిపారు.

నత్తనడకన రీ సర్వే



- ఏడాదిలో 20 గ్రామాల్లో మాత్రమే సర్వే పూర్తి
- ఒక్క రైతుకూ అందని భూ హక్కు పత్రాలు
- గత ప్రభుత్వంలో మూడేళ్లలో 2.2 లక్షల ఎకరాల్లో రీ సర్వే పూర్తి
- 70 వేల మంది రైతులకు పత్రాలు అందజేత



పోడూరులో భూములు రీసర్వే చేస్తున్న సిబ్బంది (ఫైల్)

భీమవరం(ప్రకాశం చౌక్): భూ వివాదాల పరిష్కారంతో పాటు.. ప్రభుత్వ భూముల్ని అక్రమణల నుంచి రక్షించడానికి గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భూముల రీ సర్వే చేపట్టారు. నూరేళ్ల తర్వాత భూముల రీసర్వే చేసే మహోన్నత కార్యక్రమాన్ని అమలులోకి తెచ్చారు. రాష్ట్రంలోనే జిల్లా రీ సర్వేలో ప్రథమ స్థానంలో నిలిచింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత జిల్లాలో రీ సర్వే మందకొడిగా సాగుతోంది. తప్పనిసరి పరిస్థితుల్లో రీ సర్వే కొనసాగిస్తున్నా.. వేగంగా జరిగేలా మాత్రం ఆసక్తి చూపడం లేదు. ఈ 12 నెలల కాలంలో 20 గ్రామాలను పైలట్ ప్రాజెక్టుగా తీసుకుని కేవలం 35 వేల ఎకరాలల్లో భూ సర్వే పూర్తి చేశారు. ఇంతరకు ఒక రైతుకు కూడా భూ హక్కు పత్రాలు ఇవ్వలేదు. గతంలో 100 రోజుల్లో సర్వే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తే.. ఈ ప్రభుత్వం కేవలం 60 రోజుల్లో సర్వే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించింది. దాంతో రీసర్వే నాణ్యత లేకుండా తప్పుల తడకగా సాగే అవకాశం ఉంది. కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం జరిగే పీజీఆర్ఎస్‌కు జిల్లా నలుమూల నుంచి రైతులు, ఇతరులు భూ సమస్యలపై ఫిర్యాదు చేస్తున్నారు. రీసర్వే జరగని గ్రామాల నుంచి ఎక్కువ సంఖ్యలో ఈ ఫిర్యాదులు వస్తున్నాయి. భూ సమస్యలపై వచ్చే ఫిర్యాదులను అధికారులు పరిష్కరించ లేకపోతున్నారు.

క్లస్టర్ విధానంతో కష్టాలు

ప్రభుత్వం రెవెన్యూ గ్రామాల రేషలైజేషన్ పేరిట రెండు మూడు గ్రామాలను కలిపి ఒక క్లస్టర్ చేయడానికి చర్యలు చేపట్టింది.

దానికి తోడు క్లస్టర్‌కు ఒక సర్వేయర్, ఒక వీఆర్వో ఉండేలా ఏర్పాటు చేస్తుంది. ఈ నేపథ్యంలో సిబ్బంది తక్కువగా ఉండడం గ్రామంలో భూ విస్తరణ ఎక్కువగా ఉండడంతో భూ రీ సర్వే వేగంగా జరగడం కష్టంగా మారింది. ఇదే విషయాన్ని రెవెన్యూ అధికారులు, ఆ సంఘం నాయకులు కూడా చెబుతున్నారు. ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లే ప్రయత్నం కూడా చేశారు. సర్వేయర్, వీఆర్వోపై పని ఒత్తిడి పెరిగిపోతోందని సర్వేకు తగిన సిబ్బంది ఉండాలని అసలు క్లస్టర్ విధానంలో అనేక లోపాలు ఉన్నాయని వాపోతున్నారు.

గత ప్రభుత్వంలో 2.2 లక్షల ఎకరాల సర్వే

గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో జిల్లాలో మూడేళ్లలో 2,22,934 ఎకరాల్లో భూ రీసర్వే పూర్తి చేశారు. 70 వేల మంది రైతులకు భూహక్కు పత్రాలు అందజేశారు. జిల్లా మొత్తం 5.15 లక్షల ఎకరాల సర్వే లక్ష్యం కాగా మూడు దశల్లో 2.2 లక్షల ఎకరాల్లో సర్వే పూర్తి చేశారు. 1,15,354 ఎకరాల్లో సరిహద్దు రాళ్లు పాతించారు. సర్వే చేసిన భూవిస్తరణ, హద్దులతో ఆన్‌లైన్ కూడా చేశారు. కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో కేవలం 35 వేల ఎకరాలు సర్వే చేసింది. సర్వే పూర్తిచేసిన భూమికి సంబంధించి ఒక రైతుకు కూడా భూహక్కు పత్రాలు ఇవ్వలేదు. గత ప్రభుత్వంలో ఏడాది కాలంలో 64 వేల ఎకరాల్లో సర్వే పూర్తి చేసి 36,400 మంది రైతులకు భూహక్కు పత్రాలు అందించారు.

ఆక్రమణలోని దేవదాయ భూమి గుర్తింపు

జిల్లాలో భూ రీసర్వే ద్వారా దేవస్థానాలకు చెందిన 301 ఎకరాల భూమిని ఆక్రమణ చెర నుంచి రక్షించారు. జిల్లా వ్యాప్తంగా 8095.74 ఎకరాల దేవదాయ శాఖ భూములు ఉండగా నాడు అధికారుల లెక్కల ప్రకారం 301.81 ఎకరాల భూములు అక్రమణల్లో ఉన్నాయి.

పారిజాతగిరిలో ముగిసిన బ్రహ్మోత్సవాలు



శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి విశేష పూజ

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. చివరిరోజు ఆదివారం స్వామికి జరిగిన ధ్రువ మూర్తి విశేషాభిషేకం, సాయంత్రం ద్వాదశ ఆరాధన, ద్వాదశ ప్రదక్షిణలు శ్రీ పుష్పయాగ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం నిత్య ఆరాధన అనంతరం స్వామివారి ధ్రువమూర్తికి పంచామృతాలతో, విశేష అభిషేక ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. సాయంత్రం కల్యాణ మండపంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడిని ప్రత్యేక వేదికపై అలంకరించి ద్వాదశరాధన నిర్వహించారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడిని తొళక్కం వాహనంపై తిరువీధి ఉత్సవం నిర్వహించారు. ఉత్సవ కార్యక్రమం నిర్వహించిన రిత్విక్కులను సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పేరిచర్ల జగపతిరాజు, సభ్యులు రెడ్డి రంగప్రసాద్, దండు ధనరాజు, కంది బాలకృష్ణారెడ్డి, వాసవి సాయి నగేష్, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ



యోగాసనాలపై శిక్షణ ఇస్తున్న దృశ్యం

భీమవరం: యోగాంధ్ర కార్యక్రమం విజయవంతం చేయడంలో మాస్టర్ ట్రైనర్ల పాత్ర కీలకమని జేసీ టి.రాహుల్ కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఉదయం జాయింట్ కలెక్టరు ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో రెండో రోజు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యోగా ఢిల్లీ ఆధ్వర్యంలో వర్చువల్ విధానంలో మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ కొనసాగింది. విద్యా, ఆయుష్ శాఖలు సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శిక్షణా కార్యక్రమంలో మొదటి రోజు సుమారు 100 మంది మాస్టర్ ట్రైనర్లకు యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని సుమారు 200 మంది యోగా ట్రైనర్లకు మెరుగైన శిక్షణ ఇచ్చి నెలరోజులపాటు గ్రామ, వార్డు స్థాయిలోని ప్రజలకు యోగా ప్రాధాన్యత తెలియజేసేలా కార్యక్రమాలు రూపొందించారు. యోగా గురువులు ఉప్పలపాటి వెంకటేశ్వర రాజు, బీహెచ్‌ఇ సత్యనారాయణ రాజు, పీఎస్‌డీ భవాని శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి ఇ.నారాయణ, టూరిజం శాఖ అధికారి ఎ.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కొల్లేరులో అక్రమ తవ్వకాలు

సాక్షి టాస్క్‌ఫోర్స్: ఏలూరు రూరల్ మండలం మాధవాపురం పక్షుల ఆవాస కేంద్రం వద్ద కొల్లేరులో ఆదివారం ప్రభుత్వ అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా కొందరు తవ్వకాలు చేపట్టారు. వన్యప్రాణి సంరక్షణ చట్టం మేరకు పక్షుల ఆవాస కేంద్రాలు, జంతువుల ఆవాస కేంద్రాల వద్ద యంత్రాలతో తవ్వడం నిషేధం. సమాచారం తెలుసుకున్న ఫారెస్ట్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని తవ్వకానికి ఎటువంటి అనుమతులు లేవని యంత్రాలను, పొక్లెయిన్‌ను అడ్డుకున్నారు. అయినా పనులు ఆపకపోవడంతో ఫారెస్ట్ అధికారులు తవ్వుతున్న వారి మధ్య వాగ్వాదం జరిగింది. చివరకు తవ్వకాలను నిలుపుదల చేశారు. అటవీ శాఖ చీఫ్ కన్సర్వేటివ్ ఫారెస్ట్ మూర్తి (రాజమండ్రి), ఏలూరు ఫారెస్ట్ ఆఫీసర్ విజయలక్ష్మి, సిబ్బంది ఉన్నారు.

ఆక్వాకు వాతావరణ ముప్పు

ఎండలు, అకాల వర్షాలతో నష్టాలు



చెరువులలో తిప్పుతున్న ఏరియేటర్లు



కౌంట్‌కు రాకుండానే పట్టేస్తున్న రొయ్యలు

గణపవరం: ఆక్వా రైతులు వేసవి పంటపై ఎన్నో ఆశలు పెట్టుకుంటారు. మార్చి, ఏప్రిల్ నెలల్లో చెరువులలో రొయ్య సీడ్ వేస్తే జూన్‌లో పట్టుబడికి సిద్ధమవుతుంది. ఏప్రిల్, మే నెలల్లో సాగుకు అనుకూలంగా ఉండటంతో రైతులు ఎక్కువగా వేసవి సాగుపై గంపెడాశలు పెట్టుకుంటారు. ఈ వేసవి ఆక్వా రైతులకు చుక్కలు చూపిస్తుంది. వేసవి ఆరంభం నుంచి ఎండా, వానల సయ్యాటలతో ఆక్వా సాగు దినదినగండంగా సాగుతుంది. ఏప్రిల్ నెలలో సాగు సవ్యంగానే సాగినా మే నెలలో మాత్రం తీవ్ర ఒడిదుడుకులకు లోనైంది. వాతావరణంలో విపరీతమైన మార్పులతో వందల ఎకరాలలో సాగు అర్ధాంతరంగా ముగిసిపోయింది.

కౌంట్‌కు రాకుండానే మృత్యువాత

పూటకో రకంగా మారుతున్న వాతావరణం ఆక్వా సాగుకు గండంగా మారింది. ఇరవై రోజులుగా వాతావరణంలో తీవ్ర మార్పులు రైతులకు కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి. ఒకే రోజులో విపరీతమైన ఎండలు ఒకపక్క, మరోపక్క ఉన్నట్టుండి ఆకాశం మేఘావృత్తమై వర్షాలు కురుస్తూ ఆక్వా సాగును కుదేలు చేస్తున్నాయి. గతంలో లేని విధంగా ఈ వేసవిలో సగం రోజులు వర్షాలు పడుతూనే ఉన్నాయి. ఎండకాస్తే విపరీతమైన వేడి, ఉక్కబోతతో ఆక్వా సాగు తీవ్ర ఒత్తిడికి గురవుతుంది. పిల్ల వేసిన 30 రోజులలోపుగానే వాతావరణ మార్పులకు వైట్‌స్పాట్, విబ్రియో వంటి పలు వ్యాధులు వ్యాపించడంతో కౌంట్‌కు రాకుండానే రొయ్యలు మృత్యువాత పడుతున్నాయి. రాత్రి వర్షం కురుస్తూ, పగలు ఎండలు కాయడంతో పీహెచ్‌లో హెచ్చుతగ్గుల కారణంగా రొయ్యలు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నాయి. ఆక్సిజన్ సమస్య తలెత్తకుండా మందులు చల్లడానికి చెరువుల వద్ద రేయింబవళ్లు కాపలా కాస్తున్నారు. విద్యుత్ కోతలు ఆక్వా రైతులను ముప్పుతిప్పలు పెడుతున్నాయి. విద్యుత్ కోతల కారణంగా ఏరియేటర్లు తిరగడానికి ఆయిల్ ఇంజిన్ల వినియోగానికి రోజూ వేలల్లో ఖర్చుపెడుతున్నారు.

ఆక్సిజన్ కోసం అవస్థలు

అప్పటికప్పుడు ఎండ మాయమై, మబ్బులు కమ్మి ఒక్కసారిగా వాతావరణం చల్లబడి పోవడంతో ఆక్సిజన్ సమస్య తలెత్తి చేపలు, రొయ్యలు నీటి ఉపరితలంపై తిరుగాడుతున్నాయి. కొన్ని చోట్ల చనిపోయి నీటిపై తేలుతున్నాయి. ఆక్సిజన్ లోటు పూడ్చడానికి రసాయనాలు చల్లుతున్నారు. ఆక్సిజన్ అందక చేపలు, రొయ్యలు మేతలు సరిగా తినలేక నీరసించి పోతుండటంతో రైతులు యుద్ధ ప్రాతిపదికన పట్టేసి అయినకాడికి అమ్ముకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 1.25 లక్షల ఎకరాలలో రొయ్య, మరో 1.50లక్షల ఎకరాలలో చేపల సాగు జరుగుతుంది. వాతావరణం ప్రతికూలంగా మారడంతో ఉంగుటూరు నియోజకవర్గంలోనే వారం రోజుల వ్యవధిలో దాదాపు 4 వేల ఎకరాల్లో కౌంట్‌కు రాకుండానే రొయ్యలు పట్టివేసినట్లు అంచనా. దీనికి తోడు రొయ్య ధర కూడా పదిరోజులలో కేజీకి రూ.10 నుంచి రూ.15 మేర పడిపోవడంతో రైతులకు నష్టాలు తప్పడంలేదు.

మత్స్యశాఖ అధికారుల సూచనలు

ఉష్ణోగ్రతలు తగ్గకుండా నిరంతరం ఏరియేటర్లు తిప్పుతూ నీటిని రీసైక్లింగ్ చేయాలి. ఆక్సిజన్ నివారణకు పొటాషియం పర్మాంగనేటు సిద్ధంగా ఉంచుకుని, పీహెచ్ స్థాయిని బట్టి అవసరం మేరకు చెరువులో చల్లుతుండాలి. ఆక్సిజన్ సరిపడా అందకపోవడంతో చేపలు, రొయ్యలు మేతలు సరిగా తినకపోతే పరిమితంగా మేతలు వేస్తుండాలి. ఆక్సిజన్ సమస్య ఉన్న సమయంలో మేత, సేంద్రీయ ఎరువులు వేయడం పూర్తిగా మానేయాలి.

ఉపాధ్యాయుల ధర్నా



ఏలూరు డీఈఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): యూటీఎఫ్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నాయకత్వం ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు మెరుపు ధర్నా నిర్వహించారు. గత రాత్రి ఉపాధ్యాయులను సర్ ప్లస్ పేరుతో ఒత్తిడి చేసి బదిలీలకు అప్లై చేయించడాన్ని నిరసిస్తూ మెరుపు ధర్నా నిర్వహించినట్లు సంఘ నాయకులు తెలిపారు. రాష్ట్ర విద్యాశాఖ ఉన్నత అధికారులు ఇచ్చిన హామీ మేరకు విద్యార్థుల సంఖ్య 49 దాటితే 50 వద్ద రెండో సెక్షన్ ఇచ్చి ఆ మేరకు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలనే డిమాండ్‌తో ధర్నా నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా విద్యాశాఖ అధికారి, పశ్చిమగోదావరి జిల్లా విద్యాశాఖ అధికారి చర్చలకు జరపడంతో వారిచ్చిన హామీ మేరకు ధర్నా వాయిదా వేశామన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ ఏలూరు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ ముస్తఫా అలీ, రవికుమార్ రుద్రాక్షి, పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు విజయరామరాజు, రాష్ట్ర కార్యదర్శి బీ. సుభాషిణి, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల నాయకత్వం పట్టాభి రామయ్య, జీవీ రంగమోహన్, సీహెచ్. శ్రీధర్, కె.కమల్ కుమార్, ఏపీటీఎఫ్ 1938 ప్రధాన కార్యదర్శి జి.మోహన్ పాల్గొన్నారు.

గూడెంలో భారీ వర్షం

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం పట్టణంలో శనివారం అర్ధరాత్రి ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. దీంతో అధికారులు విద్యుత్ సరఫరా నిలిపేశారు. పట్టణంలోని రెండు ప్రాంతాల్లో విద్యుత్ వైర్లు (కండక్టర్లు) కట్ కావడంతో ఆదివారం ఉదయం 7.30 గంటలకు అధికారులు విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. దాదాపు ఏడు గంటల పాటు పట్టణ ప్రజలు అంధకారంలో గడిపారు.

మద్యం ఏరులు

- 7 నెలల్లో రూ.707 కోట్ల మద్యం విక్రయాలు
- 9.62 లక్షల కేసుల మద్యం, 4.19 లక్షల కేసుల బీర్లు స్వాహా
- మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చుతున్న కూటమి సర్కార్
- జనవరిలో గరిష్టంగా రూ.113.97 కోట్ల మద్యం అమ్మకం

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలో మద్యం ఏరులై పారుతోంది. విద్య, వైద్యం పట్టని ప్రభుత్వం నిత్యం మద్యం ప్రజలకు అందుబాటులో ఉండేలా చూస్తోంది. కూటమి సర్కారు నూతన మద్యం పాలసీతో విచ్చలవిడిగా ప్రైవేటు మద్యం దుకాణాలు ఏర్పాటు చేశారు. కొత్తపాలసీలో ప్రైవేటు మద్యం దుకాణాల్లో జనాలకు మద్యాన్ని నిరంతరం అందుబాటులో ఉంచుతున్నారు. ఈ 7 నెలల కాలంలో.. ఒక్క ఏలూరు జిల్లాలోనే రూ.707 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. గ్రామ గ్రామాన మద్యం ఏరులై పారిస్తూ ప్రజలను మద్యానికి బానిసలుగా మార్చుతున్నారనే అభిప్రాయం జనాల్లో ఏర్పడింది. ఏలూరు జిల్లాలో 144 ప్రైవేటు మద్యం దుకాణాలు ఏర్పాటు చేయగా.. ఈ మద్యం దుకాణాల్లో మద్యం విక్రయాలను ఇష్టారాజ్యం చేస్తూ జనాల జేబులు గుల్ల చేస్తున్నారు. తక్కువ ధరకే మద్యం అందుబాటులోకి తెచ్చామని చెబుతూనే భారీగా అమ్మకాలు చేస్తూ వందల కోట్ల ఆదాయాన్ని ఖజానాలో వేసుకుంటున్నారు. ఏలూరు జిల్లాలో మంచినీటికి జనం అల్లాడుతుంటే.. మద్యం మాత్రం కాలువలా ప్రవహిస్తోంది. 2024 అక్టోబర్ నుంచి 2025 ఏప్రిల్ నెలాఖరు నాటికి ఏలూరు జిల్లాలో రూ.707 కోట్ల మద్యం అమ్మకాలు చేసి రికార్డు సృష్టించింది. ఏలూరు జిల్లాలో 9,62,166 మద్యం కేసులు, 4,19,344 బీర్ల కేసులు అమ్ముడుపోయాయి.

మద్యాంధ్రప్రదేశ్‌గా రాష్ట్రం



కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మారుస్తున్నారు. ప్రజలకు సంక్షేమాన్ని దూరం చేసిన ప్రభుత్వం కేవలం మద్యాన్ని అందుబాటులో ఉంచుతూ.. ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతోంది. పట్టణాలు, గ్రామాల్లో నిత్యం మద్యాన్ని అందుబాటులో ఉంచుతూ ప్రైవేటు వ్యక్తులకు దోచిపెడుతుంది. ఏలూరు జిల్లాలో ఏడు నెలల్లోనే రూ.700 కోట్లకు పైగా ఆదాయం వస్తే డబ్బంతా ప్రభుత్వం ఏం చేస్తుందో సమాధానం చెప్పాలి.

– కేసరి సరితారెడ్డి, వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా మహిళా అధ్యక్షురాలు



ఏలూరులోని ప్రైవేటు మద్యం దుకాణం

నెల	మద్యం కేసులు	బీర్ల కేసులు	మొత్తం వసూలు (రూ.లలో)
అక్టోబర్, 2024	97,161	30,826	75,72,01,869
నవంబర్, 2024	1,28,077	38,545	92,19,28,985
డిసెంబర్, 2024	1,53,872	47,901	110,75,36,380
జనవరి, 2025	1,53,866	66,325	113,97,40,180
ఫిబ్రవరి, 2025	1,36,345	64,891	99,52,36,489
మార్చి, 2025	1,47,958	85,173	109,22,43,068
ఏప్రిల్, 2025	1,44,887	85,683	105,81,85,776

జనవరిలో రూ.113.97 కోట్ల విక్రయాలు : ఏలూరు జిల్లాలో గరిష్టంగా 2025 జనవరి నెలలో భారీగా రూ.113.97 కోట్ల మేర మద్యం విక్రయాలు జరిగాయి. 2024 డిసెంబర్‌లో రూ.110.75 కోట్లకు పైగా మద్యం తాగేశారు. వేసవి రావడంతో జిల్లాలో భారీ సంఖ్యలో బీర్లు పొంగించారు మందుబాబులు. చల్లటి బీర్లను తెగ తాగేశారు. 2025 జనవరిలో 66 వేల కేసుల బీర్లు, ఫిబ్రవరిలో 64 వేల కేసుల బీర్లు, మార్చిలో ఏకంగా 85 వేల కేసుల బీర్లు, ఏప్రిల్‌లో 85,683 కేసుల బీర్లు తాగేశారు.

క్లుప్తంగా

మద్దిలో తెప్పోత్సవం



మద్ది క్షేత్రంలో ఆంజనేయస్వామికి తెప్పోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: మండలంలోని గుర్వాయిగూడెం మద్ది క్షేత్రంలో నిర్వహిస్తున్న హనుమద్ జయంతి సహిత కళ్యాణ మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఉత్సవాల్లో ఆఖరి రోజైన ఆదివారం అంజన్నకు ప్రభాత సేవ, నిత్య అర్చన, ప్రధాన హోమాలు, మహాపూర్ణాహుతి, దీక్షా విరమణ కార్యక్రమాలు అర్చకులు వైభవంగా నిర్వహించారు. అనంతరం మద్ది ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకం, ధ్వజావరోహణ, చక్రస్నానం నిర్వహించారు. పెద్దెత్తున భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం స్వామి వారికి ఆలయ పుష్కరిణిలో తెప్పోత్సవం నిర్వహించారు. కార్యక్రమాలను దేవస్థానం ఈవో ఆర్‌వీ చందన పర్యవేక్షించారు.

వనదేవతకు జన హారతి



గుబ్బల మంగమ్మ గుడికి పోటెత్తిన భక్తులు

బుట్టాయగూడెం: మండలంలోని మారుమూల గ్రామమైన కామవరం సమీపంలోని అటవీ ప్రాంతంలో కొలువై ఉన్న గుబ్బల మంగమ్మ గుడికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలతో పాటు విజయవాడ, మచిలీపట్నం, తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలం, పాల్వంచ, కొత్తగూడెం, సత్తుపల్లి, అశ్వారావుపేట ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారికి దూపదీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఆదివారం రోహిణీ కార్తె ప్రారంభం కావడంతో ఉదయం తీవ్రమైన ఎండ ఉన్నా మధ్యాహ్న సమయానికి ఒక్కసారిగా మబ్బులు కమ్మి కొద్ది సేపు వర్షం కురిసింది. భక్తులు వర్షంలోనే అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానం వద్ద భక్తుల రద్దీ



పెద్దింట్లమ్మ దేవస్థానంలో భక్తుల సందడి

కై కలూరు: వేసవి సెలవుల నేపథ్యంలో ఆదివారం సమీప జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి కొల్లేటికోట పెద్దింట్లమ్మ తల్లిని దర్శించుకున్నారు. పవిత్ర కోనేరులో స్నానాలు ఆచరించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు పేటేటి పరమేశ్వరశర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాసు మాట్లాడుతూ ఆదివారం ఒక్క రోజు ప్రత్యేక, అంతరాలయ దర్శనాలు, కేశఖండన, పెద్ద, చిన్న తీర్థాలు, లడ్డూ ప్రసాదం, గదుల అద్దెలు, అమ్మవారి చిత్రపటాల విక్రయం ద్వారా రూ.63,261 ఆదాయం వచ్చిందని చెప్పారు.

బెల్టు షాపు నిర్వాహకుడి అరెస్టు

తాడేపల్లిగూడెం రూరల్: మాధవరంలో ఆదివారం ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. బెల్టు షాపు నిర్వహిస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి ఆరు మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ ఇ.స్వరాజ్యలక్ష్మి వివరించారు. తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్సైలు మురళీమోహన్, దొరబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియం.. నిండా నిర్లక్ష్యం

- అక్కరకు రాని ఫ్లడ్‌లైట్లు
- నిరుపయోగంగా మరుగుదొడ్లు
- తెరుచుకోని జిమ్, వాటర్ ప్లాంట్

ఏలూరు రూరల్: ఏలూరు ఇండోర్ స్టేడియం గత వైభవాన్ని కోల్పోతోంది. ప్రభుత్వం ఉదాసీనత, నిధుల కొరతతో పాటు అధికారుల నిర్లక్ష్యానికి నిలువటద్దంగా మారుతోంది. గతంలో అభివృద్ధి చేసిన మౌలిక వసతులు నేడు ఎందుకూ పనికి రాకుండా పోతున్నాయి. దీనికి తోడు చినుకు పడితే స్టేడియం చిత్తడిగా మారిపోతోంది. డ్రైయినేజీ వ్యవస్థ పని చేయడం లేదు. ఫలితంగా సాధన చేసే క్రీడాకారుల సంఖ్య క్రమేపీ తగ్గిపోతోంది.



పిల్లలు లేక వెలవెలబోతున్న ఇండోర్‌స్టేడియం

నిరుపయోగంగా ఫ్లడ్‌లైట్లు

గతంలో అధికారులు లక్షల రూపాయలు వెచ్చించి స్టేడియం చుట్టూ ఆరు చోట్ల భారీ స్తంభాలతో ఏర్పాటుచేసిన ఫ్లడ్‌లైట్లు నేడు నిరుపయోగంగా మారాయి. అవసరానికి అనుగుణంగా దిశ మార్చుకునేందుకు, ఎత్తు సైతం పెంచుకుని స్టేడియం మొత్తం వెలుగులు విరజిమ్మేలా లైట్లు ఏర్పాటుచేశారు. ఇందుకోసం స్తంభాల కింద ఒక మోటార్ సైతం బిగించారు. ప్రత్యేక ఫీజ్ బాక్సులు సిద్ధం చేశారు. నేడు ఈ ఫీజు బాక్సులు కానరావడం లేదు. మోటార్లు మరమ్మతు పాలయ్యాయి. వైరింగ్ ప్రమాదకరంగా మారింది. ఈ మొత్తం వ్యవస్థను మరమ్మతులు చేయకుండా వదిలేశారు. స్టేడియం అంతటా చీకట్లు కమ్ముకుంటున్నాయంటూ వాకర్స్, క్రీడాకారులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో అధికారులు తాత్కాలిక లైట్లు ఏర్పాటు చేశారు. ఫ్లడ్ లైట్లు గురించి పట్టించుకోలేదు.

మూతబడిన జిమ్

స్టేడియంలో ఇండోర్ కూలిపోవడంతో క్రీడాకారులు సాధన చేసే జిమ్ సైతం మూతపడింది. ఈ జిమ్‌లో ఏర్పాటుచేసిన తాగునీటి సరఫరా ప్లాంట్ సైతం నిరుపయోగంగా మారింది. దీంతో క్రీడాకారులు జిమ్ కోసం స్టేడియం వదిలి, ఇతర ప్రాంతాలకు వెళ్లిపోతున్నారు.



స్టేడియంలో చిందరవందరగా మారిన స్టేజీ

కంపు కొడుతున్న మరుగుదొడ్డి

క్రీడాకారులు, వాకర్స్ సౌలభ్యం కోసం గతంలో స్టేడియం పరిసరాల్లో నిర్మించిన మరుగుదొడ్డి సైతం కంపుకొడుతోంది. ఆకతాయిలు దొడ్డి తలుపులు విరగ్గొట్టడంతో బాలికలు ఉపయోగించేందుకు భయపడుతున్నారు. కొన్నిసార్లు వాటర్, కరెంట్ సరఫరా లేకపోవడంతో మరుగుదొడ్డి ఉపయోగించుకోలేక పోతున్నామని క్రీడాకారులు వాపోతున్నారు.



నిరుపయోగంగా ఫ్లడ్‌లైటింగ్ వ్యవస్థ, స్టేజీపై మూలనపడిన సౌండ్ సిస్టమ్

చిందరవందరగా స్టేజీ

ఆటల పోటీల సమయంలో క్రీడాకారులకు బహుమతులు అందించేందుకు నిర్మించిన స్టేజీ సైతం మరమ్మతులకు నోచుకోలేదు. గతంలో స్టేజీపై విద్యుత్ లైట్లతో పాటు సౌండ్ సిస్టమ్ ఏర్పాటుచేశారు. కొంతకాలంగా స్టేజీ నిర్వహణపై పర్యవేక్షణ కొరవడడంతో సౌండ్ సిస్టమ్, లైట్లు పనికి రాకుండాపోయాయి. ఎక్కడపడితే అక్కడ వైర్లు వేలాడుతూ పిల్లలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి.

పర్యవేక్షణ కొరవడింది



సాయంత్రమైతే స్టేడియం అంతటా చీకట్లు కమ్ముకునేవి. చీకట్లో వాకింగ్ చేసి వెళ్లిపోవడమే. ఇప్పుడు తాత్కాలికంగా లైట్లు ఏర్పాటు చేశారు. కానీ గతంలో మాదిరిగా ఆట స్థలాలు అభివృద్ధి చేయడం లేదు. గతంలో ఉదయం, సాయంత్రం ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ ఆడుకునేవారు. కూలిపోయిన ఇండోర్ స్థానంలో కొత్తది నిర్మించాలి. మరుగుదొడ్డి, తాగునీరు అందుబాటులో ఉండేలా ఏర్పాటుచేయాలి.

– ఎస్ సత్యనారాయణ

ప్రత్యామ్నాయాలు చేస్తున్నాం



గతంలో నిర్మించిన ఫ్లడ్‌లైట్ల మెయింటెనెన్స్ కష్టంగా మారింది. పెద్ద ఎత్తున విద్యుత్ బిల్లులు వస్తున్నాయి. అందుకోసం వాటి స్థానంలో అవసరం మేరకు లైట్లు ఏర్పాటుచేశాం. ఇండోర్ కూలిపోవడంతో వాటర్‌ప్లాంట్, జిమ్ మూసేశాం. త్వరలో ఎస్‌బీఐ సౌజన్యంతో వాటర్‌ప్లాంట్ ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నాం. వెయిట్‌లిఫ్టింగ్ హాల్‌లో మంచినీరు ఏర్పాటుచేశాం. మరుగుదొడ్డి మెయింటెనెన్స్ ప్రైవేటు సంస్థకు అప్పగించేలా చూస్తున్నాం.

– బి శ్రీనివాసరావు, డీఎస్‌డీఓ

శాశ్వత పనులకు నోచుకోని తమ్మిలేరు కాజ్‌వే



తాత్కాలిక మరమ్మతులు చేపట్టిన దృశ్యం (ఫైల్)

చాట్రాయి: వరద వచ్చినపుడల్లా తరుచూ కొట్టుకుపోతున్న చిన్నంపేట తమ్మిలేరు కాజ్‌వేతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఖమ్మంజిల్లా సత్తుపల్లి మండలం బేతుపల్లి చెరువు అలుగు ద్వారా మండలంలోని తమ్మిలేరు రిజర్వాయర్ ప్రాజెక్టుకు వరద వచ్చినపుడల్లా చిన్నంపేట కాజ్‌వే కొట్టుకుపోతుంది. దీంతో రెండు వారాల పాటు మండలంలోని చిన్నంపేట, చింతలపూడి మండలం శివాపురం గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయి ఆయా గ్రామాల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఈ రెండు గ్రామాల వారికి ఇరువైపులా వ్యవసాయ భూములు ఉండడం, నిత్యావసర వస్తువులు కొనుగోలుకు శివాపురం గ్రామస్తులు చిన్నంపేట రావాల్సి ఉంది. అంతేగాక శివాపురం నుంచి చిన్నంపేటకు పాఠశాలలకు విద్యార్థులు వస్తుంటారు. కాజ్‌వే కొట్టుకుపోయినపుడల్లా మరమ్మతుల కోసం లక్షల్లో నిధులు వెచ్చిస్తున్నారు. తరుచూ ఈ విధమైన మరమ్మతులు చేపట్టి నిధులు ఖర్చు పెట్టడం కన్నా వాగుకు శాశ్వతమైన కాంక్రీట్‌తో కూడిన కాజ్‌వే నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

చిరుద్యోగులే బలి!

- ఇళ్ల నిర్మాణ సామగ్రి మాయం
- అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులపై వేటు
- అధికారులను వదిలేసి.. వర్క్ ఇన్‌స్పెక్టర్లపై చర్యలా!
- హౌసింగ్ ఉన్నతాధికారుల తీరుపై విస్మయం



నూజివీడులోని హౌసింగ్ ఈఈ కార్యాలయం

నూజివీడు: గృహనిర్మాణ శాఖకు సంబంధించి నూజివీడు మండలం సుంకొల్లులో మెటీరియల్ పంపిణీలో చోటు చేసుకున్న అవినీతి, అవకతవకలపై అవుట్‌సోర్సింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్‌లపై చర్యలు తీసుకోవడంపై గృహనిర్మాణశాఖతో పాటు రాజకీయ వర్గాల్లో సైతం విస్మయం వ్యక్తమవుతోంది. సుంకొల్లులో జరిగిన కుంభకోణంపై విచారణ జరపగా 2,450 బస్తాల సిమెంట్, 11,952 కిలోల స్టీలు లబ్ధిదారులకు అందలేదని తేలింది. వీటి విలువ రూ.16,52,895గా ధ్రువీకరించారు. దీంతో ఐదుగురు అవుట్ సోర్సింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్లపై వేటు వేశారు. అయితే లబ్ధిదారుడికి మెటీరియల్ ఇచ్చే విషయంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ల పాత్ర ఏమీ ఉండదనేది అందరికి తెలిసిందే. గృహనిర్మాణ శాఖ అధికారులకు ఈ విషయం తెలిసినప్పటికీ అధికారులపై చర్యలు తీసుకోకుండా వర్క్ ఇన్‌స్పెక్టర్లను బలిపశువులను చేశారనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

మెటీరియల్‌ను ఎలా జారీ చేస్తారంటే..

ఇల్లు కట్టుకునే లబ్ధిదారుడికి మెటీరియల్‌ను అందజేసే విషయంలో ఆ గ్రామానికి చెందిన ఇంజినీరింగ్ అసిస్టెంట్, ఏఈలదే కీలకపాత్ర. అయితే వాళ్లను వదిలేసి ఎలాంటి సంబంధం లేని వర్క్ ఇన్‌స్పెక్టర్లపై చర్యలు తీసుకోవడమేమిటనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఎంబుక్ నమోదు చేసి సిమెంట్, ఐరన్, ఇసుకకు సంబంధించిన మెటీరియల్ రిలీజ్ ఆర్డర్ జారీ చేసేది సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ కాగా, ఆ కూపన్‌లను తీసుకొని వచ్చిన లబ్ధిదారులకు రిలీజ్ ఆర్డర్‌లో పేర్కొన్న మేరకు మెటీరియల్‌ను హౌసింగ్‌కు చెందిన స్టాకు పాయింట్ ఇన్‌చార్జి అందజేస్తారు. స్టాక్ పాయింట్ ఇన్‌చార్జిగా ఏఈ స్థాయి అధికారి ఉంటారు. ఈ నేపథ్యంలో అధికారులపై చర్యలు తీసుకోకుండా వర్క్ ఇన్‌స్పెక్టర్‌లపై చర్యలు తీసుకోవడం నియోజకవర్గంలో తీవ్ర చర్చనీయాంశమైంది.

42 ఇళ్లకు సంబంధించి మెటీరియల్ పక్కదారి

సుంకొల్లులో 42 గృహాలకు సంబంధించి ఇళ్లు ప్రారంభించకుండానే మెటీరియల్‌ను డ్రా చేసేశారు. ఒక్కొక్క గృహానికి ఒక్కో విధంగా మెటీరియల్‌ను జారీ చేసేశారు. కొన్ని ఇళ్లకు 10 సిమెంట్ కట్టలు, మరికొన్ని ఇళ్లకు 20 సిమెంట్ కట్టలు ఇలా వారిష్టమొచ్చినట్లు రిలీజ్ ఆర్డర్ ఇచ్చేశారు. ఈ 42 గృహాలకు సంబంధించి మెటీరియల్ రిలీజ్ ఆర్డర్ ఇచ్చిన ఇంజినీరింగ్ అసిస్టెంట్‌పైన గాని, పర్యవేక్షణ అధికారులైన ఏఈ, డీఈలపైన గాని ఇంత వరకు చర్యలు లేవు. మెటీరియల్‌ను జారీ చేసిన తరువాత లబ్ధిదారులు గృహాలను నిర్మిస్తున్నారా, లేదా అనే విషయాన్ని ఏఈ, డీఈలు పర్యవేక్షించాలి. అలా చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే దుర్వినియోగం జరిగింది. ఇదంతా ఉన్నతాధికారులకు తెలిసినప్పటికీ అసలు దోషులపై చర్యలు తీసుకోకుండా దీనికి ఎలాంటి సంబంధం లేని వర్క్ ఇన్‌స్పెక్టర్లపై చర్యలు తీసుకొని మమ అనిపించేశారు.

150 కిలోల వెండి వస్తువులు చోరీ

ఏలూరు టౌన్: ఏలూరు రూరల్ మండలంలో ఒక ఇంట్లో తాళాలు పగులగొట్టి ఇంట్లోని తలవెంట్రుకలు అపహరించుకుపోయారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరు రూరల్ మండలం మాదేపల్లి సాయన్నపేటకు చెందిన కటారి వేములు తలవెంట్రుకల వ్యాపారం చేస్తూ ఉంటారు. ఈనెల 13న ఇంటికి తాళాలు వేసి కుటుంబ సభ్యులతో కలిసి తిరుపతి వెళ్లారు. వేములు కుటుంబ సభ్యులతో ఆదివారం ఇంటికి వచ్చి చూసే సరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉండడం.. లోపలికి వెళ్లి చూడగా ఇంట్లో ఉన్న 150 కిలోల తలవెంట్రుకలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు గుర్తించారు. దీనిపై బాధితులు ఏలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై సీహెచ్ దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఖరీఫ్‌కు ఆదిలోనే ఆటంకం

- అకాల వర్షాలతో అయోమయంలో రైతులు
- ఇప్పటికే వేసిన నారుమడి విత్తనాలు వర్షార్పణం



తాడేపల్లిగూడెం మండలం కృష్ణాపురం గ్రామంలో అధిక వర్షాలకు పోగులు పడిన నారుమడి

తాడేపల్లిగూడెం రూరల్: ఉపరితల ఆవర్తనం ప్రభావంతో గత 15 రోజులుగా తాడేపల్లిగూడెం మండలంలో అకాల వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలు ఖరీఫ్ వరి నారుమడి పనులకు ఆటంకంగా మారింది. ఇప్పటికే ఎల్.అగ్రహారం, పుల్లాయగూడెం, నీలాద్రిపురం, కృష్ణాపురం, మోదుగ గుంట, గొల్లగూడెం, అప్పారావుపేట తదితర గ్రామాల్లో దుక్కి దున్ని ఆకుమడి కోసం సంపద స్వర్ణ, పీఆర్.126 రకాల విత్తనాలను వేశారు. వర్షాలు విస్తారంగా కురవడంతో వేసిన విత్తనాలు నీటి ప్రవాహానికి కొట్టుకుపోతున్నాయని రైతులు వాపోతున్నారు.

ఎండాకాలంలో వర్షాలు

మే నెలలో మెండుగా ఎండలు కాయాల్సింది పోయి వర్షాలు కురవడంతో ఖరీఫ్ ఆకుమడి పనులకు ఆటంకంగా మారాయి. ఏటా ఖరీఫ్ పనులను మే నెలలో ప్రారంభించి, జూన్ నెలాఖరు నాటికి మెట్ట రైతులు పూర్తి చేస్తారు. తద్వారా ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కురిసే భారీ వర్షాల నుంచి పంట గట్టెక్కే అవకాశం ఉంటుంది. అయితే ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాలు రైతుల ఆశలపై నీళ్లు చల్లాయి. ఇప్పటికే వేసిన నారుమడి విత్తనాలు కొట్టుకుపోవడంతో వర్షాలు తగ్గిన తర్వాత మరలా విత్తనాలు వేసుకోవలసిన పరిస్థితి తలెత్తింది. దీనివల్ల ఖరీఫ్ సాగు మరింత ఆలస్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నెల 27వ తేదీ వరకు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ఈ నేపథ్యంలో ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కురిసే వర్షాల బారిన పడే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అకాల వర్షాలతో నష్టం



మే నెలలో కురుస్తున్న అకాల వర్షాల వల్ల ఖరీఫ్ ప్రారంభంలోనే నష్టాలు తప్పడం లేదు. ఈ వర్షాలకు పోసిన నారు నీటి పాలవుతుంది. దీనివల్ల మరలా విత్తనాలు చల్లుకోవలసిన పరిస్థితి వచ్చింది. ఇప్పటికైనా వర్షాలు తగ్గుముఖం పడితే విత్తనాన్ని కాపాడుకునే అవకాశం ఉంటుంది. లేదంటే మరలా పెట్టుబడులు తప్పవు.

– మైలవరపు చంద్రరావు, రైతు, పుల్లాయగూడెం, తాడేపల్లిగూడెం మండలం

మరింత ఆలస్యం



ఏడెకరాల విస్తీర్ణానికి విత్తనాలు చల్లి ఇప్పటికే 15 రోజులు కావస్తుంది. మరో ఆరు రోజుల్లో నాట్లు వేయవలసి ఉంది. అయితే, వర్షాల కారణంగా కొంత విత్తనం కొట్టుకుపోగా, మరికొంత నారుమడి తయారై పోగులుగా తయారైంది. దీనివల్ల నారుమడి సరిపోతుందో లేదో అర్థం కాని పరిస్థితి.

– మతుకుమిల్లి రామారావు, రైతు, కృష్ణాపురం, తాడేపల్లిగూడెం మండలం

బెల్టుషాపులపై 456 కేసులు

ఏలూరు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ అవులయ్య



ఏలూరు టౌన్: జిల్లాలో బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఏలూరు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఏ.అవులయ్య హెచ్చరించారు. స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకూ 456 కేసులు నమోదు చేయడంతోపాటు బెల్టు షాపులు నిర్వహిస్తున్న 478 మందిపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు స్పష్టం చేశారు. బెల్టు షాపులకు మద్యం సరఫరా చేస్తున్న ఏలూరు రూరల్, పెదవేగి మండలం, భీమడోలులోని 5 ప్రైవేటు మద్యం షాపులను సీజ్ చేశామని ఆయన తెలిపారు. వీరిపై రూ.5 లక్షల అపరాధ రుసుము విధించామన్నారు. చింతలపూడి మండలం ఎర్రగుంటపల్లిలో ఎమ్మార్పీ కంటే అదనంగా మద్యం అమ్ముతున్న కనకదుర్గ వైన్స్‌పై కేసు నమోదు చేశామని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు తీసుకుంటామని, ఇప్పటికే 70 మందిపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. అలాగే జిల్లాను నెలాఖరు నాటికి నాటు సారా రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని అవులయ్య తెలిపారు. జిల్లాలోని 140 గ్రామాల్లో సారా తయారీ కేంద్రాలు ఉన్నాయని, ఈ గ్రామాల్లో విస్తృతంగా దాడులు చేస్తూ నాటుసారా తయారీని నిరోధించామన్నారు. నవోదయం -2 పథకంలో భాగంగా ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు చూపిస్తున్నామని తెలిపారు. జిల్లాలో మద్యం అక్రమ విక్రయాలు, నాటు సారాపై 14405 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని ఎక్సైజ్ సూపరింటెండెంట్ అవులయ్య కోరారు.


లారీ డ్రైవర్ మృతి



నాగూల్ మీరా మృతదేహం

ముదినేపల్లి రూరల్: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ లారీ డ్రైవర్ ఆదివారం మృతి చెందాడు. ముదినేపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కంచికచెర్ల గ్రామానికి చెందిన షేక్ నాగూల్ మీరా(29) శనివారం శ్రీహరిపురం గ్రోవెల్స్ ఫ్యాక్టరీ గోడౌన్ వద్దకు లారీ లోడ్ దించడానికి వచ్చాడు. గోడౌన్ ప్రాంగణంలో లారీ నుంచి తలను బయటకు పెట్టి లారీ రివర్స్ చేస్తుండగా ప్రమాదవశాత్తూ లారీ, గోడౌన్ గోడ మధ్య అతని తల నలిగిపోయింది. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం షేక్ నాగూల్ మీరా మరణించాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేరుపాలెం బీచ్‌లో యువకుడి గల్లంతు



అజయ్ (ఫైల్)

నరసాపురం రూరల్: స్నేహితులతో కలసి విహార యాత్రకు వచ్చిన ఒక యువకుడు పేరుపాలెం బీచ్‌లో గల్లంతయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాలివి. దేవరపల్లి మండలం చిన్నాయగూడెంకు చెందిన యాదాల అజయ్ (27) మరో ఆరుగురు స్నేహితులతో కలిసి పేరుపాలెం బీచ్‌కు వచ్చారు. తీరంలో సరదాగా ఆడుకుంటూ ఉండగా భారీ అలలు రావడంతో అజయ్ గల్లంతైనట్లు తెలిపారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు గాలింపు చర్యలు చేపట్టారు. అజయ్ మేనమామ పాలపాటి శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వాసు తెలిపారు.

సైబర్ నేరం.. వ్యాపారికి రూ.85 వేలకు టోకరా

నరసాపురం రూరల్: సైబర్ నేరగాళ్లు ఓ వ్యాపారికి రూ.85 వేలకు టోకరా వేసిన ఘటన ఆదివారం మొగల్తూరులో చోటుచేసుకుంది. వివరాలు ఇవి. మామిడిపండ్ల వర్తకుడు దూసనపూడి రాజుకు ఆదివారం మధ్యాహ్నం ఒక ఫోన్ కాల్ వచ్చింది. తాను మొగల్తూరు ఏఎస్ఐ ఆనందరావునని, తన మేనకోడలుకు ఆరోగ్యం బాగాలేకపోవడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతుందని, ఆసుపత్రికి డబ్బు అర్జంటుగా ట్రాన్స్‌ఫర్ చేయాలని చెప్పాడు. తన దగ్గర డబ్బులు ఉన్నాయని, కానీ బ్యాంకు ఖాతాలో లేకపోవడంతో ఫోన్ చేసినట్లు వివరించాడు. అయితే తన ఖాతాలో కూడా నగదు లేదని దూసనపూడి రాజు చెప్పడంతో ఇంకా ఎవరికైనా పురమాయించమని ఆ వ్యక్తి కోరాడు. విషయం నిజమనుకున్న రాజు మొగల్తూరు కూరగాయల మార్కెట్ వ్యాపారి ముక్కు పురుషోత్తంకు పురమాయించాడు. పురుషోత్తం స్టేషన్ వద్దకు వెళ్లి బయట నుంచే ఆ వ్యక్తికి ఫోన్ చేయగా నేను సినిమా హాల్ సెంటర్లో ఉన్నాను.. ఈ 7993014578 నంబర్‌కు రూ.85 వేలు ఫోన్ పే చేయాలని సూచించాడు. పురుషోత్తం వెంటనే రూ.85 వేలను ఆ నంబర్‌కు ఫోన్ పే చేశాడు. తర్వాత ఎంత సేపటికీ ఆ వ్యక్తి స్టేషన్‌కు రాకపోవడంతో మోసపోయినట్టు గ్రహించిన పురుషోత్తం పోలీసులకు, సైబర్ క్రైంకు ఫిర్యాదు చేశాడు.

అ'పూర్వ' ఆత్మీయ కలయిక



లూథరన్ హైస్కూల్ 1975 బ్యాచ్ పూర్వ విద్యార్థుల కలయిక

భీమవరం: ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి ఇక్కడే కలిశాం .. చదువులమ్మ చెట్టు నీడలో .. అంటూ పూర్వ విద్యార్థులు ఒకే చోట కలిశారు. గడచిన ఆనాటి బాల్యాన్ని గుర్తు చేసుకుని సందడి చేశారు. లూథరన్ హైస్కూల్ 1975 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు 50 ఏళ్ల తరువాత ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సత్కరించుకున్నారు. ఒకరిని ఒకరు పలరించుకుంటూ చిన్ననాటి మన స్నేహబంధం.. చిరకాలపు మధుర స్మృతులుగా పంచుకున్నారు. పూర్వ విద్యార్థులు తటవర్తి భాస్కరరావు, నంబూరి మాధవ, సుజ్ఞానరాజు, బెల్తాజర్, గోపా సత్యనారాయణ కొందరు మిత్రులు కలిసి గత కొన్ని నెలలుగా అందరినీ కలుపుకుని పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించామని తెలిపారు. 20 మంది ఉపాధ్యాయులను సత్కరించినట్లు చెప్పారు.

క్లుప్తంగా

ఇంటింటికీ ఉచిత వైద్యం



తణుకులో వృద్ధురాలికి వైద్యసేవలందిస్తున్న డాక్టర్ హుస్సేన్ అహ్మద్

తణుకు అర్బన్: సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటికి ఉచిత వైద్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, డాక్టర్ సుంకవల్లి నీలు మహేంద్ర వైద్య బృందం తణుకు, సజ్జాపురం, పైడిపర్రు ప్రాంతాల్లో ప్రత్యేక వాహనంలో పర్యటించి ఇంటికే పరిమితమైన 6గురు వృద్ధులకు వైద్యసేవలందించారు. సభ్యులు కె.రామమోహన్‌రావు ఆర్థికసాయంతో ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు సంఘ అధ్యక్షుడు అల్లూరి కరుణాకరచౌదరి తెలిపారు. ఉచిత వైద్యసేవలు అవసరమైనవారు 99853 43530, 90592 90717 నంబర్లలో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజాల నాగేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగా చేయిస్తున్న విద్యుత్ ఏఈ రామకృష్ణ. చిత్రంలో ఎంపీడీవో విశ్వనాథ్

తాడేపల్లిగూడెం రూరల్: యోగా సాధనను నిత్యకృత్యంగా చేయాలని ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ అన్నారు. యోగాంధ్ర–2025లో భాగంగా ఆదివారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో విద్యుత్ ఏఈ రామకృష్ణ ఆధ్వర్యంలో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో విశ్వనాథ్ మాట్లాడుతూ యోగా ప్రతీవారి జీవితంలో ఒక భాగం కావాలని, యోగా సాధన ద్వారా శారీరక, మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. అనంతరం యోగాసనాల ప్రాముఖ్యతను వివరించారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ రాజా శ్రీనివాస్, పీఆర్ ఏఈ శ్రీనివాస్, ఆర్ అండ్ బీ, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆధునికీకరణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



ఏలూరు కాలువ ఆధునీకరణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని నవాబుపాలెం వద్ద ఓ అండ్ ఎం ఆపరేషన్ గ్రాంట్ రూ.27.17లక్షలతో చేపట్టిన ఏలూరు కాలువ ఆధునీకరణ పనులను ఆదివారం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలువలను ఆధునీకరించి రైతులకు సాగునీటికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ఇరిగేషన్ ఏఈఈ సుధారాణి, జనసేన మండల అధ్యక్షుడు అడపా ప్రసాద్, నాయకులు పైబోయిన రఘు, పాలూరి వెంకటేశ్వరరావు ఉన్నారు.

ఘనంగా సీతారాముల విగ్రహ పునః ప్రతిష్ఠాపన పూజలు



అత్తిలి మండలం కొమ్మరలో విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు చేస్తున్న దృశ్యం

అత్తిలి: మండలంలోని కొమ్మర గ్రామంలో సీతారామచంద్రస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠా మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం గ్రామోత్సవం, విఘ్నేశ్వరపూజ, గోపూజ, అఖండ దీపారాధన, అంకురార్పణ, మండపారాధన, అగ్నిమథనం, జలాధివాసం, క్షీరాధివాసం కార్యక్రమాలను గ్రామ పురోహితులు కొంపెల్ల శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. సోమవారం చండీహోమం, గోపూజ, 27న పంచగవ్య ప్రాశన, మంత్ర హోమం, 28న ఉదయం 8.24 గంటలకు శ్రీసీతారామచంద్రమూర్తి విగ్రహ ప్రతిష్ఠ, అఖండ అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులందరూ ఈకార్యక్రమాలలో పాల్గొని స్వామివారి కృపాకటాక్షాలను పొందాలని పురోహితులు కొంపెల్ల శ్రీరామచంద్రమూర్తి తెలిపారు.

వ్యక్తి మృతిపై కేసు నమోదు

భీమవరం: ఒకటో పట్టణానికి చెందిన వి.రవికుమార్ (40) మృతిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడు కుప్పకూలిపోగా సమీపంలోని ఆర్ఎంపీ వైద్యుడు వచ్చి పరీక్షించి గుండెపోటు వచ్చిందని చెప్పగా వెంటనే పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్చారు. ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు ఎస్సై ఎస్‌వీవీఎస్ కృష్ణాజీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు.

వర్షపు నీటితో రహదారులు ఛిద్రం





తాడేపల్లిగూడెం మండలం కడియద్ద-జగ్గన్నపేట, జగ్గన్నపేట-పెదతాడేపల్లి రహదారిపై నిలిచిన వర్షపు నీరు

- ఆ రోడ్డులో ప్రయాణం నరకమే..
- అవస్థలు పడుతున్న వాహన చోదకులు

తాడేపల్లిగూడెం రూరల్: ఉపరితల ఆవర్తనం ప్రభావంతో తాడేపల్లిగూడెం మండలంలో గత పది రోజులుగా నిర్విరామంగా వర్షాలు పడుతూనే ఉన్నాయి. ఉదయం, రాత్రి ఏదో ఒక సమయంలో ఒక మోస్తారు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో మండలంలోని ప్రధాన రహదారులపై వర్షపు నీరు నిలుస్తోంది. ప్రధానంగా వెంకట్రామన్నగూడెం – జగ్గన్నపేట, జగ్గన్నపేట – కడియద్ద, పెదతాడేపల్లి – జగ్గన్నపేట, దండగర్ర – జగన్నాథపురం, తాడేపల్లిగూడెం – ప్రత్తిపాడు వై.జంక్షన్‌కు వెళ్లే రహదారులపై వర్షపు నీరు నిలుస్తోంది. ఈ నేపథ్యంలో రోజుల తరబడి నీరు నిలిచిపోవడంతో రహదారులు ఛిద్రంగా మారుతున్నాయి. వాహన రాకపోకలతో కొన్ని చోట్ల మెటల్ చిప్స్ పైకి లేచి గుంతలు ఏర్పడుతున్నాయి. మే నెలలో ఎండలు కాయవలసింది పోయి విస్తారంగా వర్షాలు పడుతుండటంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 27వ తేది వరకు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే పాడైన రహదారులు ఈ వర్షాలకు మరింత అధ్వానంగా తయారయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. రహదారులపై నిలిచిన వర్షపు నీరు బయటకు పోయే మార్గాలను ఏర్పాటు చేయడం ద్వారా రహదారులు పది కాలాల పాటు నిలుస్తాయని స్థానికులు పేర్కొంటున్నారు.



కడియద్ద గ్రామంలో రహదారిపై నిలిచిన వర్షపు నీరు



తాడేపల్లిగూడెం-ప్రత్తిపాడు రహదారిపై వర్షపు నీటికి పైకి లేచిన మెటల్ చిప్స్

ముగిసిన పుంతలో ముసలమ్మ అమ్మవారి జాతర

అత్తిలి: మంచిలి గ్రామంలో వేంచేసియున్న శ్రీపుంతలో ముసలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ఆదివారంతో ముగిసాయి. మూడు రోజుల పాటు అమ్మవారి జాతర మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయ ప్రాంగణంలో అఖండ అన్నసమారాధన జరిపారు.

'గూడెం'లో 12.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణ, మండలంలో గడిచిన 24 గంటల్లో 12.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ ఎం. సునీల్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాగా, పెంటపాడు మండలంలో 4.8 మిల్లీ మీటర్లుగా వర్షపాతం నమదైందన్నారు.

3న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జూన్ 3వ తేదిన ఉదయం 10 గంటలకు మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ తెలిపారు. ఎంపీపీ పొనుకుమాటి శేషులత అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎమ్పీటీసీలు, మండల స్థాయి అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పలువురు వక్తలు కొనియాడారు. పట్టణంలో గ్రేడ్ –1 శాఖ గ్రంథాలయంలో ఆదివారం ఆసక్తికరంగా శిక్షణ తరగతులు జరిగాయి. రిసోర్స్‌పర్సన్లు ఎ.జనార్ధనరావు, కోపల్లె శ్రీనివాస్‌రావు, జి.బాపయ్యశర్మలచే కథలు, పుస్తక పఠనం, సైన్స్, పొడుపు కథలు, నీతి కథలు, ఆటలు ఆడించారు. కాలం రుతుపవనాలు గురించి చెప్పారు. ఈ కార్యక్రమంలో గంథాలయాధికారి వి.శ్రీనివాసరావు పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లాప్‌టాప్ వినియోగంపై విద్యార్థులకు అవగాహన

అత్తిలి: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా అత్తిలి శాఖా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు కథలు చెప్పడం, కథలు చెప్పించడం, పుస్తక పఠనం, పుస్తక సమీక్ష చేయించారు. లాప్‌టాప్ వినియోగంపై అవగాహన కల్పించారు. మారుతున్న కాలమాన పరిస్థితులకు అనుగుణంగా ప్రతి విద్యార్థి లాప్‌టాప్ పరిజ్ఞానాన్ని కలిగి ఉండాలని రిసోర్సుపర్సన్ టి సందీప్ అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి డి కృష్ణారావు, జి శేషవేంద్రరావు, పి వెంకటేశ్వరరావు, సీహెచ్ బాలాజీ, ఎం ప్రసాద్, ఆర్ దానకృష్ణ, టి ప్రియాంక, వి అనుపమ పాల్గొన్నారు.



వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులు



అత్తిలి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు లాప్‌టాప్‌పై అవగాహన కల్పిస్తున్న రిసోర్సుపర్సన్

సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని, పేదల సొంత ఇంటి కలను నెరవేర్చాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.సీతారాంప్రసాద్ అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం కేఎస్ఎన్ కాలనీ శాఖ సమావేశం జరిగింది. వక్తలు మాట్లాడుతూ పట్టణంలో ఇళ్ల స్థలాల కోసం అర్జీలు పెట్టుకున్న అర్జీదారులకు న్యాయం చేయాలన్నారు. ప్రభుత్వ హామీలు ఉచిత బస్సు, నిరుద్యోగ భృతి, ఉపాధిహామీ పథకం, పెన్షన్లు, రేషన్ కార్డులు అందజేయాలని, అకాల వర్షాలు రైతులు పాలిటీ శాపాలుగా మారాయిని, ప్రభుత్వం వెంటనే రైతులకు న్యాయం చేయాలన్నారు. హామీలు అమలు చేయకపోతే జూన్ 2వ తేదీన తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా జరుగుతుందని జయప్రదం చేయాలని కోరారు. కపర్థి వర్ధంతి, నటుడు మాదాల రంగారావు జయంతి సందర్భంగా చిత్రపటాలకు పూలమాలవేసి నివాళు లర్పించారు. సీపీఐ నాయకులు మండల నాగేశ్వరరావు, నాగరాజు, నాగలక్ష్మి, కార్యకర్తలు పాల్గొన్నారు.



కపర్థి, మాదాల రంగారావు చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

కపర్ది ఆశయాల సాధన కోసం పోరాడుదాం

తాడేపల్లిగూడెం (టీఓసీ): అమరజీవి ఎంవీఎస్ కపర్ధీ అనుసరించిన విధానాల స్ఫూర్తితో, కార్మిక హక్కుల కోసం ఉధృత పోరాటాలు సాగించాలని ఏఐటీయూసీ నాయకులు పిలుపునిచ్చారు. ఎంవీఎస్ కపర్ధీ వర్ధంతి కార్యక్రమం ఆదివారం ఏరియా కమిటీ ఆధ్వర్యంలో జరిగింది. ఏఐటీయూసీ పతాకాన్ని ఎగురవేశారు. కపర్ధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కపర్ధీ జీవిత విశేషాలు, ఆశయాలు, పోరాటాలు, సాధించిన విజయాలను తెలిపారు. ఏపీఎస్ ఆర్టీసీ ఆవిర్భావం, కార్మిక సంఘాలకు ఆద్యుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండలపర్తి హరీష్, ఎం.జగన్మోహన్, కె.లక్ష్మీనారాయణ, కె.లక్ష్మణరావు, తాడికొండ శ్రీనివాసరావు, దువ్వా శ్రీనివాస్, పోలిరాతి ఆదినారాయణ, సాయి బాలాజీ, కె.శ్రీను, టి.బుచ్చిబాబు కనక మహాలక్ష్మీ, కుమారి, పార్వతీ, శిరీష పాల్గొన్నారు.



కపర్థీ విగ్రహానికి నివాళ్లలు అర్పిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

అస్తవ్యస్తంగా రాళ్ల చెరువు ఇన్‌లెట్

- కల్వర్టు లేక ఇబ్బందులు
- ఎదురు ప్రవహిస్తున్న నీరు
- మునిగిపోతున్న రోడ్లు

ఆకివీడు: స్థానిక గుమ్ములూరు సెంటర్‌లోని రాళ్ల చెరువు ఇన్‌లెట్ బోదె అధ్వానంగా తయారైంది. యూటర్న్ తీసుకున్నట్లు ఇన్‌లెట్ బోదె అవుట్‌లెట్ బోదెగా మారిపోయి నీరు ఎదురు ప్రవహిస్తుంది. పంట బోదెలో వ్యర్థాలు పారవేయడంతో మురికి కూపంగా మారింది. ఎదురు ప్రవహించడంతో ఆ ప్రాంతంలోని లోతట్టు ప్రాంతాలను ముంచి వేస్తుంది. ముగరుగు నీరు పంట కాలువలోకి చొచ్చుకు వెళుతుంది.

పంట కాలువలో వ్యర్థాలు

పంట కాలువలో వాటర్ ప్యాకెట్లు, ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇతర వ్యర్థాలను పారవేస్తున్నారు. రాళ్ల చెరువులోకి నీరు వెళ్లాలంటే పంట బోదెను తవ్వాల్సి ఉందంటున్నారు. పంట బోదె ప్రాంతం ఆక్రమణలకు గురి కావడంతో తవ్వకానికి కూడా వీలు లేకుండా ఉందని పలువురు వాపోతున్నారు. మురుగునీరు ఎదురు ప్రవహించడంతో సాయి బాబా ఆలయానికి వెళ్లే మార్గాన్ని ముంచెత్తుతుంది. దీంతో స్థానికులు, బాబా ఆలయానికి వచ్చే భక్తులు పలు ఇబ్బందులు పడుతున్నారు. పంట బోదె సమీపంలోని సాయిబాబా ఆలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాలకు వచ్చిన భక్తులు పంట బోదె ముంపు ప్రక్షాళన చర్యలు చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం పవిత్రోత్సవాల ముగింపు సందర్భంగా అఖండ అన్నసమారాధనలో పాల్గొన్న వేలాది మంది భక్తులు ముక్కులు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. స్థానిక నగర పంచాయతీ శానిటరీ సిబ్బంది, ఇన్‌స్పెక్టర్ కనీస పారిశుద్ధ్య చర్యలు చేపట్టలేదని పలువురు ఆరోపిస్తున్నారు.

రాళ్ల చెరువుకు ఇక్కట్లు

రాళ్ల చెరువుకు అవుట్‌లెట్, ఇన్‌లెట్ పూడిపోవడంతో చెరువులోకి నీరు ప్రవేశించక మోటార్లతో తోడుకోవాల్సి వస్తుంది. రెండు ప్రాంతాల్లోనూ ఆక్రమణలకు గురై ఇళ్ల నిర్మాణం చేశారు. పంట, మురుగు బోదెలు అభివృద్ధి చేయకపోవడంతో చెరువులో నీరు పూర్తిగా కలుషితమై బట్టలు ఉతకడానికి ఇబ్బందికరంగా తయారైందని రజక సంఘం ప్రతినిధులు దొడ్డిపట్ల పెద్దిరాజులు వాపోయారు.



చెత్తాచెదారంతో నిండిపోయిన రాళ్ల చెరువు ఇన్‌లెట్

కల్వర్టు నిర్మించాలి



ఆకివీడు రాళ్లచెరువు ఇన్‌లెట్ బోదెకు కల్వర్టు నిర్మించాలి. కాలువలో పూడికలు తీసి అభివృద్ధి చేయాలి. ప్రస్తుతం ఇన్లెట్ బోదె లేక రాళ్ల చెరువులోకి నీరు తోడుకోవాల్సి వస్తుంది. దీంతో పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ బోదెకు కల్వర్టు నిర్మిస్తే రైతులు ఉపయోగకరంగా ఉంటుంది.

– అంబటి రమేష్, ఆకివీడు

అవుట్‌లెట్, ఇన్‌లెట్ కనిపించడం లేదు



రాళ్లచెరువుకు అవుట్‌లెట్, ఇన్‌లెట్ పూర్తిగా పాడైపోయాయి. ఇది ఆక్రమణకు గురైంది. గుర్రపుడెక్క, చెత్తాచెదారంతో నిండిపోయింది. చెరువులోకి నీరు రాక ఉన్న నీరు కలుషితమవుతుంది. అవుట్‌లెట్ ఆక్రమణకు గురై పూర్తిగా మూసుకుపోయింది. దీనిపై ఇళ్ల నిర్మాణాలు కూడా చేశారు. రజకలు ఉపయోగించుకునే రాళ్లచెరువు అభివృద్ధికి కృషి చేయాలి.

– బి.మహంకాళి, రజక సంఘం గౌరవ అధ్యక్షుడు, ఆకివీడు

మహా స్థూపంలో సాయినామ పుస్తకాలు నిక్షిప్తం

ఆకివీడు: ఓం సాయి, శ్రీ సాయి, జయ జయ సాయి అంటూ ఆకివీడు ప్రాంతం సాయి నామంతో పునీతమైంది. పవిత్రోత్సవాల్లో భాగంగా స్థానిక గుమ్ములూరు సెంటర్‌లోని సాయిబాబా ఆలయంలో ఆదివారం కాకడ హారతి, అభిషేకములు, సామూహిక సత్య వ్రతములుసత్సంగ ప్రసంగం జరిగాయి. తొలత తెల్లవారుజాము నుండి మధ్యాహ్నం వరకూ సాయి కోటేశ్వర్ 100 అడుగుల స్థూపంలో ఐదు కోట్ల సాయి నామముల గల సాయి కోటి పుస్తకముల్ని భక్తులు నిక్షిప్తం చేశారు. సాయి కీర్తనలతో ఆ ప్రాంతం మారుమ్రోగింది. పవిత్రోత్సవాలు ఆలయ నిర్వాహకులు, సాయి గురు కె.సూర్యనారాయణ ఆధ్వర్యంలో జరిగాయి. అనంతరం అఖండ అన్నసమారాధనకు వేలాది మంది హాజరయ్యారు.



స్థూపంలో సాయినామ పుస్తకాలు నిక్షిప్తం చేస్తున్న భక్తులు

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

భీమవరం: ఒకటో పట్టణ పరిధిలో ద్విచక్ర వాహనంపై వెళుతుండగా లారీ ఢీ కొనడంతో ద్విచక్ర వాహనం వెనుక కూర్చున్న మహిళకు గాయమైందని పోలీసులు తెలిపారు. భీమవరం నుంచి పంజా వేమవరం వెళుతుండగా ఈ సంఘటన జరిగిందన్నారు. హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు.

వంతెన పునః ప్రారంభం ఎప్పుడో?



రాకపోకలు నిలిచిపోయిన పాలకోడేరు-గొల్లలకోడేరు వంతెన



మరమ్మతులు చేపట్టిన గొల్లలకోడేరు వంతెన

అధికారుల నిర్లక్ష్యంతో వాహనదారుల ఇక్కట్లు

పాలకోడేరు: యనమదుర్రు డ్రెయిన్‌పై గొల్లలకోడేరు వద్ద గల వంతెన పునర్నిర్మాణంలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా రెండు నెలల నుంచి ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వంతెన శిథిలావస్థకు చేరడంతో ఎన్నో విజ్ఞప్తుల మేరకు స్థానిక ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు చొరవతో మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయి. దీనిని ఏప్రిల్ 10వ తేదీన మరమ్మతులు చేపట్టినప్పుడు నెలాఖరులోగా పనులు పూర్తి చేస్తామని ఆర్అండ్‌బీ అధికారులు ప్రకటించారు. అయితే మరమ్మతులు ఆలస్యంగా చేయడంతో ఎట్టకేలకు వంతెనపై శ్లాబ్ పూర్తి చేశారు. నిబంధనల ప్రకారం ఇంకా 20 రోజులు ఆగాలంటున్నారు. ఈ వంతెనపై రాకపోకలు నిలిపి వేయడం వలన పాలకోడేరు నుంచి కుముదవల్లి మీదుగా భీమవరం నుంచి తిరిగి రావలసి వస్తోందని వాపోతున్నారు. గరగపర్రు, గొల్లలకోడేరు గ్రామాల ప్రజలు పాలకోడేరు వెళ్లాలంటే భీమవరం వెళ్లి తిరిగి రావాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. అలాగే అత్యవసర పరిస్థితిలో హాస్పిటల్‌కు వెళ్లాలన్నా తిరిగి వెళ్లాల్సి వస్తుందని ఈలోగా ప్రాణానికే ప్రమాదం ఏర్పడుతుందని రోగులు వాపోతున్నారు. ప్రతి రోజూ ఈ వంతెన మీదుగా వందలాది ఉద్యోగులు విధులు నిర్వహించడానికి వెళ్లే వారు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఆర్అండ్‌బీ ఏఈ శేఖర్‌ను వివరణ కోరగా ఏప్రిల్ 10వ తేదీ నుంచి మరమ్మతులు చేపట్టామని, ఇటీవలే శ్లాబ్ పనులు పూర్తై 12 రోజులైందన్నారు. క్యూరింగ్ పీరియడ్ 20 రోజులని ప్రస్తుతానికి మోటార్ సైకిల్ రాకపోకలకు సౌకర్యం కలిగించామని త్వరలోనే అన్ని వాహనాలకు రాకపోకలు కల్పిస్తామని బదులిచ్చారు.

న్యాయ అవగాహన సదస్సు ఏర్పాటు

భీమవరం: పిల్లలు అపహరణకు గురి కాకుండా అనునిత్యం తల్లిదండ్రులు, సంబంధీకులు అప్రమత్తంగా ఉండాలని భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి యోహాన్ (న్యూటన్) అన్నారు. ఆదివారం అంతర్జాతీయ తప్పిపోయిన పిల్లల దినోత్సవం సందర్భంగా తప్పిపోయిన, అపహరణకు గురైన పిల్లల పట్ల ప్రజలకు అవగాహన కల్పించుటకు భీమవరం లంకపేటలో ఏర్పాటుచేసిన న్యాయ అవగాహన సదస్సుకు న్యూటన్ ముఖ్య అతిథిగా పాల్గొని చట్టాలపై అవగాహన కల్పించారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

భీమవరం: కడప జిల్లా మైలవరం గ్రామంలో నాలుగేళ్ల చిన్నారిని రేప్ చేసిన నిందితులను కఠినంగా శిక్షించి, ఉరి తీయాలని దళిత సంఘం నాయకులు డిమాండ్ చేశారు. భీమవరం అంబేడ్కర్ సెంటర్‌లో దళిత సంఘాల ఆధ్వర్యంలో నిరసన ధర్నా నిర్వహించారు. అంబేడ్కర్ ఆశయ సాధన కమిటీ ఫౌండర్ కోనా జోసెఫ్, దళిత నాయకులు గంటా సుందర్‌కుమార్, కేసి రాజు మాట్లాడుతూ నాలుగేళ్ల చిన్నారిపై ఇటువంటి దాడులు జరగడం దళిత సంఘాలు ఖండిస్తున్నాయని, నిందితులను కఠినంగా శిక్షించడమే కాకుండా ఎన్‌కౌంటర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈది రవికుమార్, టి.ప్రశాంత్, గతాల సందీప్, పిల్లి రవికాంత్, గెడ్డం జార్జ్, ఈది శేఖర్, ఆధార్ రాజు తదితరులు పాల్గొన్నారు.